# శిక్ష

ప్రఫుల్లచంద్ర

అర్ధరాత్రి.. కేశవాపురం నుంచి స్కూటర్ మీద సీతానగరంకి వస్తుండగా రామాపూర్ వద్ద హఠాత్తుగా కుక్క అడ్డంగా రావడంతో సడన్ బ్రేక్ వేశాడు మురారి. అంతే, వెనక కూర్చున్న సీత కిందపడింది. ఆమె తలకు మైలురాయి బలంగా తాకడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది.

పత్రికల్లో ప్రముఖంగా వచ్చిన ఆ వార్త సీతానగరంలో సంచలనం రేపింది.

మురారి సీతానగరంలో ఒక బ్యాంక్ కాషియర్. అతని భార్య సీత టీచర్. చిలకా గోరింకల్లాంటి జంట. పెళ్ళయి మూడేళ్ళు గడిచినా పిల్లలు లేని లోటు తప్ప- హాయిగానే ఉన్నారు. మంచివాళ్ళన్న పేరు తెచ్చుకున్నారు.

సీత మరణంతో హృదయ విదారకంగా విలపిస్తున్న మురారిని, కన్నీరు మున్నీరుగా రోదిస్తున్న అత్తమామల్ని- ఊరంతా తరలివచ్చి సానుభూతి తెలిపింది.

• • •

''అది యాక్సిడెంట్ కాదు సార్! మా చెల్లిని వాళ్ళే చంపేశారు'' రోదిస్తూ చెప్పాడు రాంగోపాల్.

అతడు సీత కన్నా ఐదే నిముషాలు ముందు పుట్టాడు. కవల పిల్లలు కావడాన వాళ్ళిద్దరి మధ్యా అన్నా-చెల్లీ అనుబంధం కన్నా స్నేహానురాగాలే ఎక్కువ. తలిదండ్రులకు చెప్పని విషయాలు కూడా సీత అన్నయ్యకు చెప్పుకునేది.

ఇలా పెళ్ళి కాగానే అలా పిల్లలు పుట్టేస్తారని పెద్దల నమ్మకం. ఏడాది గడిచినా సీత నెల తప్పనందుకు అమ్మలక్కల గుసగుసలూ, అత్తమామల రుసరుసలూ, రెండేళ్ళు గడిచాక మురారి కూడా సూటిపోటీ మాటలు మొదలుపెట్టాడు. అయితే ఆ రుసరుసలూ, సూటిపోటీ మాటలూ- సీత ఒంటరిగా వున్నప్పుడే. నలుగురి ఎదుటా మాత్రం ప్రేమాభిమానాలు కురిపించేస్తారు. ఆ నటన చూసి నిజమని నమ్మిన ఆ కాలనీవాళ్ళు- అలాంటి అత్తమామలు లభించడం సీత పూర్వజన్మ సుకృతం అని నమ్మేవాళ్ళు.

అత్తమామల అసలు నైజం గురించి సీత చెప్పినా తలిదండ్రులు నమ్మేవారు కాదు. అందుకే అన్నయ్యకు చెప్పుకొని ఏడ్చేది.

మూడేళ్ళు గడిచాక- దీనికి విడాకులిచ్చేసి మరో పెళ్ళి చేసుకోమని సీత ఎదుటే మురారికి సలహా ఇవ్వడం ప్రారంభించారు అతని తలిదండ్రులు.

అంతలో సీత హఠాన్మరణం... అందుకే రాంగోపాల్‌కి అనుమానం.

సీతానగరంలో- న్యాయంకోసం, న్యాయంకోసం మాత్రమే పోరాడే సంస్థగా 'చైతన్యవిక్రమం'కి మంచి పేరుంది. ఆ సంస్థలో చైతన్య- లాయర్ అయితే విక్రమ్ డిటెక్టివ్. ఇద్దరూ కలిసి ఎన్నో విజయాలు సాధించారు.

''అందుకే మీవద్దకొచ్చాను. నాకు న్యాయం కావాలి సార్!'' ఆవేశంగా అన్నాడు రాంగోపాల్.

''ఆవేశపడకండి. మీరు అనుమానించడం సహజమే కావచ్చు. కాని సహేతుకంకాదు. నిజానికి మురారికి తన భార్యను చంపవలసిన అవసరమే లేదు. అతనికి సులభంగానే విడాకులు పొందే అవకాశం ఉండగా ఎందుకు హత్య చేస్తాడు?'' అడిగాడు విక్రమ్.

''అక్కడే వుంది అసలు కీలకం'' చెప్పాడు రాంగోపాల్.

• • •

తన చెల్లిని ఆమె భర్త మురారి హత్య చేశాడని రాంగోపాల్ కేసుపెట్టగా కోర్టులో విచారణ జరుగుతోంది.

సీతానగరంలో చాలామందికి మురారి కుటుంబం పట్ల సదభిప్రాయం వుంది. మురారి మీద కేసు అంటే ఎవరూ నమ్మలేదు. ఇదేదో దుగ్ధతో బనాయించిన తప్పుడుకేసు అని అందరి అభిప్రాయం. న్యాయం తరపున మాత్రమే పోరాడుతానని చెప్పుకునే చైతన్య- మురారికి వ్యతిరేకంగా వాదించబోవడం వారికి మింగుడుపడలేదు. డబ్బు చేతిలో పడితేచాలు నందిని పంది చేస్తారీ లాయర్లు అనుకున్నారు.

విచారణ వినడానికి జనం తరలివచ్చారు.

బోనులో నిలబడి తన భార్య మరణించిన వైనం వివరిస్తున్నప్పుడు మురారి గొంతు బొంగురుపోయింది. సన్నని కన్నీటి పొర కళ్ళను కమ్ముకుంది. ప్రేక్షకులు అతని దీనావస్థకు ద్రవించిపోతుండగా-

''మీరు పేపర్లు చదువుతూ ఉంటారా?'' ప్రశ్నించాడు లాయర్ చైతన్య.

పేపర్లకూ ఈ కేసుకూ సంబంధం ఏమిటని కాబోలు కాసేపు లాయర్ వైపుచూసి ''చదవను.. ఏం?'' అన్నాడు మురారి.

''చదివితే మీకు తెలిసి వుండేది- గత మూడు సంవత్సరాలుగా రామాపూర్ ఉత్తమ పంచాయితీగా ఎంపికవుతూ వచ్చింది. అక్కడ దోమలుగాని, కుక్కలుగాని, పందులుగానీ లేవు! మరి మీ స్కూటర్‌కు అడ్డంగా కుక్క ఎలా వచ్చింది?'' నవ్వాడు చైతన్య.

మొదట గతుక్కుమన్నట్టు కనిపించినా, తర్వాత సర్దుకొని ''అక్కడ కుక్కలెందుకు లేవో తెలుసుకోడానికొచ్చింది కాబోలు'' అన్నాడు మురారి కాస్తంత ఎగతాళిగా. అంతా ఘొల్లున నవ్వేశారు.

చైతన్యని ఎద్దేవా చేయడానికెవరూ సాహసించరు. ఈ ఎగతాళి చైతన్యకు కొత్త అనుభవమే. అయినా తనూ నవ్వేస్తూ ''అది చాలా మంచి కుక్క అయివుండాలి. ఎందుకంటే- మీరు కోరుకున్నట్టే అది మీ స్కూటర్‌కే అడ్డుపడడం, దాంతో మీరు కోరుకున్నట్టే మీ భార్య కిందపడి మరణించడం- మీరు కోరుకున్నట్టే మీ రెండో పెళ్ళికి మార్గం సుగమం అవడం- అంతా కుక్క దయ! చాలా మంచి కుక్క!'' వెటకారంగా అన్నాడు చైతన్య.

ఇందాక నవ్వినవాళ్ళే ఇప్పుడూ నవ్వేశారు. మురారి ముఖం మాడిపోయింది. చైతన్యని ఎద్దేవా చేయడం ప్రమాదం అని అర్థం అయింది. నవ్వుతున్న ప్రేక్షకుల మస్తిష్కంలో ఏదో అనుమానం మెదిలింది. నవ్వు ఆగిపోయింది.

చైతన్య మాటల్లో ఏదో కిరికిరి వుంది. అది అర్థం అయీ అవనట్టుంది! ముందుగా తేరుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణ- చైతన్య మాట తీరుకూ అభియోగానికీ అభ్యంతరం చెప్పాడు.

''యువరానర్! ముద్దాయి ధోరణిబట్టే నా మాట తీరు వుంది! నా అభియోగం నిరాధారం కాదు. నిరూపించబోతున్నా'' అన్నాడు చైతన్య.

రాధాకృష్ణ అభ్యంతరాన్ని తోసిపుచ్చాడు న్యాయమూర్తి. కొద్దిదూరంలో కిందవుంచిన భోజనం క్యారేజీని చూపిస్తూ ''దాన్ని మైలురాయి అనుకోండి. దాని మీద మీ భార్య ఎలా పడిపోయారో చూపించండి'' అడిగాడు చైతన్య.

ఇబ్బందిగా ప్రాసిక్యూటర్‌వైపు చూశాడు మురారి. ఏ నిబంధన ప్రకారం అభ్యంతరం చెప్పాలో అర్థంకాక అతడు దిక్కులు చూస్తున్నాడు. ఇంక మురారికి తప్పలేదు. బోనులోంచి బయటకొచ్చి- స్కూటర్ నుంచి జారి మైలురాయి మీద సీత పడిన భంగిమ నటించి చూపించాడు.

''ఆ భంగిమలో మీ భార్య నుదురు మైలురాయికి తగిలి, నుదురు చిట్లి, ఆమె మరణించింది.

అవునా?'' మృదువుగా అడిగాడు చైతన్య.

''అవును'' అంటూ వుండగానే మురారి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

ఆ తర్వాత- తలమీద గాయంవల్ల సీత మరణిం చిందని పోస్ట్‌మార్టం చేసిన డాక్టర్ ధృవీకరించాడు.

''తలమీద గాయం అంటే... నుదుటి మీదనా? తల వెనుకనా? మాడు మీదనా?''

వెంటనే జవాబు చెప్పలేదు డాక్టర్. కాసేపాగి ''నుదుటి మీద గాయం ఉందిగాని దానివల్ల ప్రాణం పోలేదు. మాడు మీద తగిలిన దెబ్బవల్లనే ప్రాణంపోయి ఉండాలి.''

''ఆ దెబ్బ మైలురాయి వల్ల లేదా మరేదైనా రాయివల్ల కలిగి ఉండవచ్చునా?''

''రాయివల్ల కాదు. ఇనప రాడ్ లేదా గొట్టం వల్ల కావచ్చు.''

ఎవరూ ఊహించని ఈ సమాధానానికి అందరూ దిగ్భ్రాంతి చెందారు.

''ఇలాంటి గొట్టం కావచ్చునా?'' చటుక్కున బ్రీఫ్‌కేసులోంచి ఒక గొట్టం తీసి చూపించాడు చైతన్య. కొత్తగా మరకలు, వేలి ముద్రలూ పడకుండా అది ఒక పోలిథిన్ బ్యాగ్‌లో భద్రంగా ఉంచబడింది. డాక్టర్ దాన్ని పరిశీలించి ''కావచ్చు'' అన్నాడు. ప్రేక్షకులు నీట్లకు అతుక్కుపోయి గుడ్లప్పగించి చూస్తున్నారు.

''డాక్టర్! మీరు సీతగారి శవాన్ని పరీక్షించాక బంధువులు శవాన్ని దహనం చేశారు. మరి ఇప్పుడు రక్తం మరకలు, కేశాలు, గోళ్ళు లాంటివి లభిస్తే అవి సీతగారివి అవునో కాదో చెప్పడానికి వీలవుతుందా?''

''సీతగారి అన్ని వివరాలూ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశాను. మీరిప్పుడు రక్తం, కేశాలు, గోళ్ళు ఇస్తే అవి సీతగారివి అవునా కాదా పరీక్షించి చెప్పగలను.''

''దట్స్‌గుడ్... యువరానర్! ఈ గొట్టం మీద రక్తం మరకలున్నాయి. అక్కడక్కడ కేశాలు అంటుకొని వున్నాయి. అవి సీతగారివి అవునా కాదా పరీక్షించడానికి డాక్టర్‌గారికి అనుమతి ఇవ్వవలసిందిగా కోరుతున్నా'' అన్నాడు చైతన్య.

న్యాయమూర్తి అనుమతి ఇచ్చాక- ''యువరానర్..'' అంటూ అలవోకగా కోర్టు హాలంతా కలియజూశాడు చైతన్య. అతడలా చూస్తే ఏదో సంచలన విషయం చెప్పబోతున్నాడని ప్రేక్షకులకు తెలుసు. అదేమిటా అని ఉత్కంఠగా చూస్తున్నారు.


''యువరానర్! ఈ గొట్టం మీద వేలిముద్రలుండొచ్చు. ఉంటే.. అవి మురారిగారివి అవునా కాదా నిర్ధారించమని వేలిముద్రల నిపుణుల్ని ఆదేశించవలసిందిగా కోరుతున్నా.''

కోర్టులో అందరూ షాక్ అయినట్టు ఉండిపోయారు. చైతన్య మాటలు తలలోకి యింకిన తర్వాత వాళ్ళంతా అనుమానంగా, దిగ్భ్రాంతిగా మురారివైపు చూస్తోంటే అతడు ముడుచుకుపోయాడు.

కోర్టు వాయిదా పడింది.

• • •

కేసు మళ్ళీ రేపు విచారణకు వస్తుందనగా ఈరోజు సీతానగరం అట్టుడికిపోయింది. హోటళ్ళలో, జంక్షన్‌లవద్ద, సినిమాహాళ్ళలో- ఏ ఇద్దరు కలిసినా ఆ సంచలన వార్త గురించే చర్చ... ఆ సంచలన వార్త... మురారి ఆత్మహత్య!





## సహజం

''ఏమయ్యా! ఆ అటెండర్ లోన్ అప్లికేషన్ ఇంగ్లీషులో టైపు చేసింది నువ్వేనా? దాన్నిండా అన్ని తప్పులేంటి?'' అరిచాడు ఆఫీసర్.

గతుక్కుమన్న క్లర్కు ''అటెండర్‌కి పర్‌ఫెక్ట్ ఇంగ్లీషు రాదు కదండీ. సహజంగా వుంటుంది కదా అని కావాలనే కొన్ని తప్పులు కొట్టాను సార్'' కవరు చేసుకున్నాడు

## నటుడు

''సార్! హీరోగారు విస్కీ సీసాలో పోసిన కూల్ డ్రింక్ త్రాగి నటించరట. సహజత్వం కోసం విస్కీ బాటిల్ తెమ్మంటున్నారు'' గాబరాగా చెప్పాడు అసిస్టెంట్ డైరెక్టర్.

''సరే అలాగేగానీ. హెలికాప్టర్‌నుంచి కిందకు దూకే సీన్ డూప్‌తో వద్దు. నేచురాలిటీకోసం ఆయన్నే దూకమను'' తాపీగా చెప్పాడు డైరెక్టర్.


## ఆదర్శం

అప్పారావు కొడుకులు ప్రతి చిన్న విషయానికీ గొడవపడడం, తన్నుకోవడం చేస్తుండేసరికి వాళ్ళకి హితబోధ చేయాలని వాళ్ళని కూచోబెట్టుకుని నచ్చచెప్పసాగాడు తండ్రి.

''చూడండ్రా అన్నదమ్ములంటే ఎలా వుండాలి. ఎప్పుడైనా ఒకర్ని విడిచి ఒకరు ఉండలేనట్టు ఉండాలి. మీరు టీవీలో చూడడంలేదూ. రామలక్ష్మణుల్లా, భరత శత్రుఘ్నుల్లా, బలరామకృష్ణుల్లా అన్నదమ్ములంటే అలాగ అన్యోన్యంగా ఉండాలి. మీరు వాళ్ళని ఆదర్శంగా తీసుకోండి''.

''కానీ మేము వాలి సుగ్రీవులని, సుందోపసుందులని ఆదర్శంగా తీసుకున్నాము నాన్నా'' అన్నారు కొడుకులు.

- కె.వి.ఆర్.కె.మూర్తి (గుంటూరు)




ఆరోజే చైతన్యకూ, యస్పీకి కొరియర్ ద్వారా మురారి రాసిన ఉత్తరాలు అందాయి.

''... కరడుకట్టిన నేరస్తులు ఎంత ఘాతుకాలైనా చేసి విమర్శలను తట్టుకొని బ్రతికేస్తారు. మంచివాడని ఇమేజ్ సంపాదించిన వాళ్ళు కూడా- ఎవరూ అనుమానించరులే అన్న ధీమాతో- ఘాతుకాలు చేస్తుంటారు. తీరా గుట్టు రట్టయితే మాత్రం తట్టుకోలేరు. నా విషయమూ అంతే.

మాకు పిల్లలు పుట్టకపోవడం మా యింట్లో పెద్ద సమస్యయి కూర్చుంది. లోపం సీతలోనే వుందని మా అందరి నమ్మకం. ఇతరుల ఎదుట ఆమెనేమీ అనకపోయినా, ఎవరూ లేనపుడు మాత్రం ఆమెను మానసికంగా హింసించేవాళ్ళం. విడాకులూ.. రెండోపెళ్ళి అన్న ఆలోచనలు రోజు రోజుకూ బలపడడంతో లాయర్ రాయించిన కాగితాల మీద సంతకం పెట్టమని సీతను అడిగాను.

ఇద్దరం పరీక్షలు చేయించుకుందాం. లోపం ఎవరిలో ఉందో తేలాక విడాకుల గురించి ఆలోచించవచ్చని ఖచ్చితంగా చెప్పేసింది సీత. నాకూ నా సమర్థత మీద లోలోనే అనుమానం వుండేది. రహస్యంగా పరీక్ష చేయించుకున్నాను. వీర్యంలో కణాలు తక్కువగా వున్నాయని, మందుల వల్ల నయం కావచ్చని డాక్టర్ సున్నితంగా చెప్పినా- దానికి అర్థం ఒకటే. పిల్లలు పుట్టకపోవడానికి లోపం నాదే. సంఘం నన్ను నపుంసకుడిగా పరిగణించి గేలి చేస్తుంది!

విడాకుల కోసం కోర్టుకుపోతే అసలు విషయం బయటపడి పరువుపోతుందన్న భయంతో కోర్టులు గీర్టులూ వద్దని నాన్నతో ఖరీఖండీగా చెప్పేశాను.

సీతను ఒదుల్చుకోడానికి పథకాలు ఆలోచించారు అమ్మా, నాన్నా. కిరసనాయిల్ పోసి తగలబెట్టడం లాంటి ఘాతుకాలు చేయలేం. పొరపాటు గ్రహపాటుగా మారి కోడలు చనిపోయినట్టు నమ్మించేందుకు రెండు ప్లాన్‌లు సిద్ధం అయాయి.

అందరికంటే ముందుగా సీత నిద్రలేచి, మొదట బాత్‌రూంలోకి, తర్వాత కిచెన్‌లోకి వెళ్తుంది. అందువల్ల బాత్‌రూం స్విచ్ ముట్టుకోగానే షాక్ కొట్టేటట్టు అమర్చాడు నాన్న.

అయితే ఆ సమయంలో కరెంట్ కట్ అవడంతో బ్రతికిపోయిన సీత- తెల్లవారేక స్విచ్‌ని గమనించి బాగుచేయించింది. మరో పదిరోజులు గడిచాక సీత కిచెన్‌లో అడుగు పెట్టగానే గాస్ లీక్ వాసన! లైట్ వెలిగించడానికి స్విచ్ వేస్తే చాలు ఆమె కథ అక్కడితో ముగిసేది. కాని ఆమె సమయస్ఫూర్తితో స్విచ్ జోలికి వెళ్ళకుండా రెగ్యులేటర్ ఆఫ్ చేసి కిటికీలు బార్లా తెరిచి- బ్రతికిపోయింది.

కరెంట్ పథకం, గాస్ పథకం విఫలం కావడంతో ముచ్చటగా మూడోది స్కూటర్ యాక్సిడెంట్ పథకం సిద్ధం అయింది.

స్నేహితుని పెళ్ళికి సీతతో స్కూటర్ మీద కేశవాపురం వెళ్ళాను. అక్కడ ఆలస్యం అవడంతో తిరిగి వచ్చేటప్పుడు స్కూటర్ వేగం పెంచాను. అర్ధరాత్రి. ట్రాఫిక్ లేదు. పథకం ప్రకారం రామాపూర్ మైలురాయి వద్ద సడన్ బ్రేక్ వేశాను. అనుకున్నట్టుగానే సీత పట్టుతప్పి రోడ్డుమీద పడింది. కాని చావలేదు. ప్రక్కనున్న పంట కాలువలోకి జారిపోకుండా మైలురాయిని పట్టుకొని పెనుగులాడుతోంది. మంచితరుణం - మించిన దొరకదు. చుట్టూ చూశాను. పది గజాల దూరంలో సైకిల్ రిపేర్ పాక.. అక్కడ నుంచి ఇనప గొట్టం తెచ్చుకొని సీత నెత్తిమీద బలంగా మోదాను. ఆమెలో చలనం ఆగిపోయింది. కాని అప్పుడామె చూసిన చూపు నన్నింకా వెంటాడుతూనే వుంది. ఆ చూపులో మంట ఉంది. కసి ఉంది. ఓరీ నికృష్టుడా అని తిడుతున్నట్టుంది. కళ్ళు మూసినా తెరిచినా, నిద్రలోనూ మెలకువలోనూ, ఇంటా బయటా అనునిత్యం ఆ చూపు నన్ను కలవరపెడుతోంది. శపిస్తోంది.

సీత చనిపోయాక ఆ గొట్టాన్ని కొద్దిదూరంలో పొదల మధ్యకు విసిరేశాను. ఆ గొట్టం ఎవరికైనా దొరికి నన్ను హంతకునిగా నిలబెడుతుందన్న ఆలోచనే రాలేదు నాకా సమయంలో.

దూరంగా ఆటో వస్తున్న శబ్దం వినిపించగానే బిగ్గరగా రోదిస్తూ, అరుస్తూ రోడ్డుమీద నిల్చున్నా. ఆటో ఆగింది. ఆటోడ్రైవర్ మా బ్యాంక్ కస్టమర్. నాకు తెలిసినవాడే. అతని సాయంతో సీత శవాన్ని యింటికి తెచ్చాను.

నేను, నా తలిదండ్రులూ బిగ్గరగా రోదించడం మొదలుపెట్టాం. చుట్టుప్రక్కలవాళ్ళు వచ్చారు. క్రమక్రమంగా బంధువులూ మిత్రులూ వచ్చారు. అందరూ మమ్మల్ని ఓదార్చారు. ఎవరూ మమ్మల్ని అనుమానించలేదు. మాకున్న ఇమేజ్ అది!

అంతా సవ్యంగా జరిగిపోతున్నది. శవాన్ని దహనం చేసేస్తే సమస్య తీరిపోయినట్టే. కాని అప్పుడే జరిగిందొక అనుకోని సంఘటన.

రాంగోపాల్ పోలీసులతో రావడం.. వాళ్ళు శవాన్ని పరీక్ష కోసం తరలించడం.

అటువైపు లాయర్ మరెవరైనా అయితే ఎలాగో కేసు నుంచి బయటపడేవాడినే. కాని అటువైపు వున్నది చైతన్య! ఆయన ప్రతిభ నాకు తెలుసు. పైగా హత్యాయుధం ఆయన చేతచిక్కింది. కేసు ఫలితం నాకు స్పష్టంగా తెలుస్తూనేవుంది.

నాపట్ల, నా కుటుంబంపట్ల ఎంతో నమ్మకం, సదభిప్రాయం గల మిత్రులకు, బంధువులకూ ముఖం చూపించలేను. అందుకే నిద్రమాత్రలు మింగి శాశ్వత నిద్రలోకి పోతున్నా. నా చివరి కోరిక ఒక్కటే-

సీత హత్యకు పురిగొల్పిన నా తలిదండ్రులకు నా మరణమే తగిన శిక్ష. వాళ్ళకి వేరే శిక్ష విధించకండి.''

★